క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో నేడు పంచాంగ శ్రవణం

సామర్లకోట: ఉగాది పర్వదినంను పురస్కరించుకొని బుధవారం ఉదయం 8 గంటలకు స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో పంచాగ శ్రవణం జరుగుతుందని ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబులు మంగళవారం విలేకర్లకు తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పంచాగశ్రవణం, రుత్వికుల రక్షాబంధనం, కలశ స్థాపనతో వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, చల్లా కుమారి, కర్రి వెంకటలక్ష్మి, బొందలపు కృష్ణ వేణి, ముమ్మిడి బేబిరాణి పాల్గొన్నారు.

కబడ్డీలో విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి: పెద్దాపురం మండలం దివిలి చంద్రమాంపల్లిలోని జెడ్పీ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో వాకతిప్ప జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కనపర్తి నూకరాజు తెలిపారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్ఎం జిలాని స్మారక కబడ్డీ పోటీలు ఈనెల 17 నుంచి 3 రోజుల పాటు నిర్వహించగా వాకతిప్ప చైతన్య కబడ్డీ క్లబ్ జట్టు ప్రతిభ కనపరిచి ద్వితీయ స్థానం సాధించడంతో పాటు రూ.8వేలు నగదు, ట్రోఫీని సాధించారు. విద్యార్థులను ఎంఈఓ వేణుగోపాల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, సర్పంచి పాలాని దొరబాబు అభినందించారు.

రక్తదానంతో ప్రాణాలు నిలుస్తాయి

సామర్లకోట: రక్తదానంతో నిండు ప్రాణాలు నిలుస్తాయని, యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని భగత్ సింగ్ కేంద్రం అధ్యక్షుడు కరణం ప్రసాదరావు అన్నారు. ఈ నెల 23న భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్ర ప్రతినిధులు బాలం శ్రీనివాసు, సీహెచ్ మహేష్, ప్రకృతి ఈశ్వరరావు, తలారి నాగమణి, బాలం హరిబాబు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వంతో మానసిక ఆరోగ్యం


విరవ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థికి రాగిజావ తాగిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు


వేట్లపాలెంలో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు


సామర్లకోట మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న ఆవాల రాజేశ్వరి తదితరులు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పాఠశాలల్లో రాగిజావ పంపిణీ ప్రారంభం

పిఠాపురం: చదువుకునే పిల్లలు శారీరక దృఢత్వాన్ని కలిగి ఉంటేనే మానసికంగా బలంగా ఉండి ఏదైనా చేయగలుగుతారని, అందుకే ప్రభుత్వం పిల్లల ఆరోగ్యాన్ని మరింత పెంచాలని రాగి జావ పంపిణీని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. విరవ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి జరిగిందన్నారు. విద్యార్థులకు చదువు రావాలంటే వారు శారీరకంగా బలంగా ఉండాలనే ఉద్దేశ్యంతో గోరుముద్ద పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు రాగి జావను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నడిగట్ల చింతలరావు పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. గొల్లప్రోలు మండలంలో జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. పిఠాపురం మండలం నర్సింగపురంలో వైఎస్సార్ సీపీ నేత ఉలవల భూషణం విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు.

రాగిజావతో సంపూర్ణ ఆరోగ్యం

సామర్లకోట: ప్రభుత్వం ఇప్పటికే మధ్యాహ్న భోజనంలో అందిస్తున్న పౌష్టికాహారానికి తోడు రాగిజావతో విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వేట్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న గోరు ముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు రాగి జావ అందించే కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని రోజూ ఉదయం రాగి జావ ఇచ్చే విధంగా ఏర్పాటుచేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి చిరకాలం ఉండాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. విశాలమైన ప్రాంగణంలో ఉన్న వేట్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 850 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, ఇక్కడ జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పీబీ దేవం, జి.మేడపాడు, హుస్సేన్‌పురం గ్రామాల్లో చదువుకునే విద్యార్థులకు ఈ కళాశాల ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల చెంతనే పాఠశాలలు ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి పనిచేస్తూ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, ఎంపీడీవో వి.సాయిబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్ చౌదరి, పాఠశాల హెచ్‌ఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: విద్యార్థులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రేమను మరోసారి రుజువు చేశారని అయ్యారక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి అన్నారు. పట్టణ పరిధిలోని యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు రాగిజావ పంపిణీని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాగి జావను అందివ్వాలని నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయుడు యు.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. బీబీఆర్ హైస్కూల్‌లో దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు రాగి జావ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పెద్దాపురం: విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావ పంపిణీకి శ్రీకారం చుట్టారని పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని పలు పాఠశాలల్లో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని సాయిప్రసాద్ ప్రారంభించారు. వడ్లమూరులో జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు ప్రారంభించారు.

కొతపల్లి మండలంలో..

కొత్తపల్లి: మండలంలోని మూలపేట జెడ్పీ పాఠశాలలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. సర్పంచి కంబాల మౌనిక, ఎంపీటీసీలు అడ్డా పాప, గోగు లోవకుమారీ తదితరులు పాల్గొన్నారు. పొన్నాడ శివారు కోనపాపపేట జెడ్పీ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, వాకతిప్ప జెడ్పీ పాఠశాలలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు పాల్గొని రాగిజావ అందజేశారు.

క్రిస్టియన్ల సమస్యల పరిష్కారానికి కృషి


గిరిని అభినందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: క్రిస్టియన్ మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జాషువా గిరి మంగళవారం ఎమ్మెల్యే పెండె దొరబాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జాషువా గిరిని ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. జిల్లా పాస్టర్ ఫెలోషిప్ జిల్లా ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ డి.విక్టర్ శామ్యూల్, పి.ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

పెద్దాపురం: బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం పెద్దాపురం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. విజయవాడలో న్యాయవాది ఆత్మూరి వెంకట భగవాన్‌పై దాడి, రాజమహేంద్రవరంలో బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు అరెస్టులకు నిరసనగా విధులు బహిష్కరించినట్లు పెద్దాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేదుల సుబ్రహ్మణ్యం, కందుల నరేష్‌కుమార్‌లు తెలిపారు. కార్యక్రమంలో రాయుడు, ఏవీ జనార్దన్, మడికి రాంబాబు, కందుల వెంకటాచలం పాల్గొన్నారు.

ఊరూరా జాతరలు, తీర్థాలు


యండపల్లిలో నూకాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: కొత్త అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని మండలం యండపల్లిలోని నూకాలమ్మ తల్లి తీర్థం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి చలిమిడి, వడపప్పు సమర్పించి సుఖ శాంతులు, అష్ట ఐశ్వర్యాల కోసం కల్లును మూడుమార్లు ధారగా పోశారు. కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, అమీనాబాద్, రమణక్కపేట తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అదే విధంగా కోడిపిల్లలను కావిడిగా కట్టి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. స్థానిక నూకాలమ్మ యూత్ సభ్యులు తాగునీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎస్సై రామలిగేశ్వరరావు బందోబస్తు పర్యవేక్షించారు. మండలంలో అమ్మవారి ఆలయాల్లో తీర్థాలు జరిగాయి.

కిటకిటలాడిన నూకాలమ్మ ఆలయాలు

సామర్లకోట: కొత్త అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని నూకాలమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నవరలోని నూకాలమ్మ అమ్మవారిని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ప్రెసిడెంట్ పేర్నిడి వెంకట్రాయుడు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, తాటికొండ అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.


పెద్దాపురంలో నూకాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం నూకాలమ్మ అమ్మవారి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. ఏటా అమావాస్య రోజున నిర్వహించే చల్లఘటం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. చలువకుండ నెత్తిన పెట్టుకుని గరగలతో గ్రామోత్సవం జరిపారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు నిమ్మకాలయ చిన రాజప్ప, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నానిలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గరగ ఉత్సవంలో పాల్గొన్నారు.

ఉగాదికి సిద్ధమైన దేవాలయాలు


ఉగాది ఉత్సవాలకు సిద్ధమైన పిఠాపురం పాదగయ పుణ్య క్షేత్రం

పిఠాపురం: నియోజక వర్గ పరిధిలో ఉగాది సంబరాలకు దేవాలయాలు సిద్ధమయ్యాయి. బుదవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు పంచాగ పఠనాలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. పాదగయ క్షేత్రంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఆగొంటి ప్రభాకర్ తెలిపారు. కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం పండితులచే పంచాంగ పఠనం జరుగుతుందన్నారు. భక్తులకు ఉగాది పచ్చడి, పంచాంగాలు, విసినకర్రలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలోను పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు హాజరుకానున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. కొత్తపల్లిలో ధర్మశాస్తా దేవస్థానంలో ఉగాది వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. గొల్లప్రోలు మండలంలోని ఉగాది వేడుకలను ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, విష్ణాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వర స్వామికి అభిషేకాలు, అర్చనలు జరుపుతారు. అనంతరం అర్చకులు ఆకొండి వెంకటేశ్వర శర్మ, పంచాంగ శ్రవణం చేస్తారు. చేబ్రోలులోని సీతారామస్వామి ఆలయం పర్వతవర్ధనీ సమేత ఉమారాలింగేశ్వర ఆలయంలోనూ పూజలు జరిపి ఉగాది పచ్చడిని భక్తులకు పంచేందుకు ఏర్పాట్లు చేశారు.

అంగన్‌వాడీ సహాయక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- వయో పరిమితి 35 సంవత్సరాలు
- స్థానికులకే అవకాశం
- ఆఖరి గడువు ఈ నెల 31వ తేదీ

పిఠాపురం: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ సహాయకులు 9 పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సీహెచ్ ఎస్‌కే దుర్గాదేవి మంగళవారం తెలిపారు. పిఠాపురం పట్టణంలో 3, పిఠాపురం రూరల్‌లో 1, గొల్లప్రోలు నగర పంచాయతీలో 2, గొల్లప్రోలు మండలంలో 2, కొత్తపల్లి మండలంలో 1 అంగన్‌వాడీ హెల్పర్లు ఖాళీలు ఉన్నట్లు ఆమె తెలిపారు. రాపర్తి సచివాలయం-4 పక్కన అంగన్‌వాడీ హెల్పర్-1 ఖాళీ ఉండగా బీసీ-ఈకి కేటాయించారన్నారు. ఇందిరానగర్‌లో వార్డు నంబరు-7లో ఒక ఎస్సీ, మిరపకాయల వీధిలో వార్డు-9లో 1, ఓసీ కేటగిరి జనరల్‌కు, కొత్తపేట వార్డు-6లో 1 ఓసీ జనరల్‌కు అభ్యర్థులకు కేటాయించారన్నారు. కొత్తపల్లి మండలంలో కుతుకుడుమిల్లి (పెదకలువలదొడ్డి) 1 బీసీ-ఏ, గొల్లప్రోలు రూరల్ దుర్గాడ-6 రామాలయం బీసీ-ఈ, చేబ్రోలు నందివీధి (యాదవులపేట) 1 బీసీ-బీ అభ్యర్థులకు కేటాయించారన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ హెల్పర్ గొల్లప్రోలు రంగప్ప చెరువు వార్డు-3లో ఓసీ జనరల్‌కు, పాపయ్యచావిడి వీధి వార్డు-4లో 1 బీసీ-డీ అభ్యర్థులకు కేటాయించారన్నారు. ఈ పోస్టులకు మహిళలు మాత్రమే అర్హులని, 21 నుంచి 35 ఏళ్లలోపు ఉండి పదో తరగతి ఉత్తీర్ణులై, స్థానికులై ఉండాలన్నారు. బుధవారం నుంచి పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని పూర్తి చేసిన ధరఖాస్తులు ఈనెల 31వ తేదీ లోపున ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలన్నారు.

సామర్లకోట ఐసీడీఎస్ పరిధిలో..

సామర్లకోట: స్థానిక రూరల్ ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ జీవీ రమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ రూరల్ ఇంద్రపాలెం, నవర, చంద్రంపాలెం, తిమ్మాపురం, రేపూరు, పెదపూడి, జి.మామిడాడల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెలాఖరులోగా దరఖాస్తులు చేసుకోవొచ్చన్నారు.

పవరలో చర్చికి శంకుస్థాపన

సామర్లకోట: పవర గ్రామంలో నిర్మించనున్న చర్చికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన క్రైస్తవ సంఘ నాయకులు దొరబాబుకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, ఎంపీటీసీ నాగనబోయిన చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

- చాంపియన్‌గా నిలచిన దివిలి జట్టు
- ముగింపు సభకు హాజరైన దొరబాబు, చినరాజప్ప


విజేతలకు బహుమతులు అందజేస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: చంద్రమాంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన ఎస్ఎం జిలాని మెమోరియల్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారంతో ముగిశాయి. చాంపియన్ షిప్ విజేతగా దివిలి కబడ్డీ టీమ్ నిలిచింది. ముగింపు సభలో పాల్గొన్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, స్థానిక శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్పలు మాట్లాడుతూ శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. గ్రామీణ స్థాయిలో పేరొందిన క్రీడలపై ప్రతిఒక్కరూ మక్కువ పెంచుకోవాలని సూచించారు. అనంతరం విజేతగా నిలిచిన దివిలి కబడ్డీ టీమ్‌కు దొరబాబు, రాజప్పల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఎంపీపీలు పెంకే సత్యవతి, బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, జిలాని శిష్య బృందం కమిటీ సభ్యులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కురిమెళ్ల లోవరాజు, మొయిళ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు శిక్షణ దోహదం


శిక్షణ ముగింపు సందర్భంగా ధ్రువపత్రాలు అందజేస్తున్న కృష్ణమోహన్ తదితరులు

సామర్లకోట: గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు రెండు రోజుల పాటు ఇచ్చిన శిక్షణ దోహదపడాలని పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ అదనపు కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుస్థిర లక్ష్యాల సాధనపై ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదరికం లేని గ్రామం, జీవనోపాధులు, ఆరోగ్యవంతమైన గ్రామం తదితర అంశాలపై ఫ్యాకల్టీలు ఎస్ఐఆర్డీ డైరెక్టర్ మధుసూదన్, శ్రీదేవి, లలిత, శ్రీనివాస్, కెజియా, సుబ్బారావు, పి.శ్రీనివాస్‌లు శిక్షణనిచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా టీఓటీలకు ధ్రువపత్రాలు అందజేశారు.